క్లుప్తంగా

దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధులు

చాదర్‌ఘాట్: దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధులతో కలిసి మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో శారీరక దివ్యాంగుల రోస్టర్ 10లోపు మార్చాలని అన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. దివ్యాంగులకు స్వయం ఉపాధి యూనిట్స్ పెంచాలని, ప్రభుత్వ పథకాల్లో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం



వెంకటేష్‌గౌడ్

నాగోలు: కులగణన చరిత్రాత్మక నిర్ణయమని కులగణన నిర్వహించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని డీసీసీ అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. దేశంలో కులగణన జరగాలని డాక్టర్. అంబేడ్కర్, రామ్ మనోహర్ లోహియా ఎంతో పోరాడారు. కులగణన లేకపోవడంతో విద్యా,ఉద్యోగ, రాజకీయ రంగాల్లో న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ కులగణన ప్రస్తావన వచ్చినప్పుడల్లా వ్యతిరేకించాయి. ఇప్పుడు మనస్ఫూర్తిగా అంగీకరిస్తారా లేదా అనేది చూడాలని అన్నారు.

వే బ్రిడ్జి అవసరం లేదు



చెకోలేకర్ లక్ష్మి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వే బ్రిడ్జ్ (కాంటా) అవసరం లేదని మార్కెట్ చైర్ పర్సన్ చెకోలేకర్ లక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినియోగంలో లేని వే బ్రిడ్జికి మరమ్మతు చేసి టెండర్లు పిలిస్తే ఎవరూ ముందుకు రావడం లేదని, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వాహనాలు బయట నుంచే తూకం వేసుకొని మార్కెట్‌లోకి వస్తున్నాయని తెలిపారు. మార్కెట్‌లో ఉన్న వే బ్రిడ్జిపై అటు రైతులు, వ్యాపారులు, వాహనదారులు సుముఖం చూపటం లేదని దీంతో పాలకవర్గం వే బ్రిడ్జిపై నిర్ణయం తీసుకుని తీర్మానం చేశామన్నారు.

మామిడికాయలను కార్బైడ్‌తో మగ్గపెడితే చర్యలే



సమావేశంలో పాల్గొన్న అధికారులు వ్యాపారులు

చాదర్‌ఘాట్: మామిడికాయలను కార్బైడ్ వంటి రసాయనాలతో మగ్గపెడితే చర్యలు తప్పవని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఉపసంచాలకులు, దామోదర్, చిలుక నరసింహారెడ్డి హెచ్చరించారు. మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మంగళవారం జాంబాగ్‌కు చెందిన మామిడి వ్యాపారులతో సమావేశమైన మాట్లాడారు. మామిడికాయలను కార్బైడ్‌తో కాకుండా ఇథలీన్ గ్యాస్‌తో మగ్గపెట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంతికి గోల్డ్ మెడల్



గోదారి ప్రశాంతిని సన్మానిస్తున్న వెంకట దుర్గప్రసాద్

మన్సూరాబాద్: ఇటీవల తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ పవర్ లిఫ్టింగ్–2025 ఛాంపియన్ పోటీల్లో ఎల్‌బీనగర్‌కు చెందిన గోదారి ప్రశాంతి (69 కేజీల విభాగంలో) గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటారు. మంగళవారం మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని కాకతీయ పాఠశాల డైరెక్టర్ వెంకట దుర్గప్రసాద్ ప్రశాంతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి తల్లిదండ్రులు విజయలక్ష్మి, అంజయ్య, మహాత్మాగాంధీ లా కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్లముందే కాలిపోయాయి!

గతంలో 450, ఇప్పుడు 30 గుడిసెలు దగ్ధం

- సాయినగర్ అగ్నిప్రమాదంలో బాధితుల కన్నీటిపర్యంతం
- ఎల్‌బీనగర్‌లో అందుబాటులో లేని ఫైర్‌స్టేషన్
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వేడుకోలు



నాగోలు సాయినగర్ కాలనీలో కాలిపోతున్న గుడిసెలు

నాగోలు: క్షణకాలంలో తమ గూడు కాలిపోతున్నా వంట గ్యాస్ సిలిండర్ల పేలుళ్లకు ప్రాణభయంతో భయాందోళన చెందుతూ కదలలేక పోయామని అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇంట్లో ఉన్న సరుకులు, నిత్యావసర వస్తువులు, డబ్బు, ఆభరణాలు, సర్టిఫికెట్లు కాలి బూడిదయ్యాయని విలపిస్తున్నారు. 2012లోనూ ఇలాగే జరిగిందని అప్పుడూ 450 గుడిసెలు కాలిపోయి సర్వం కోల్పోయి నానా అవస్థలు ఎదుర్కొని నిలబడిన తాము మళ్లీ మాపై పగబట్టిన అగ్ని ప్రమాదం మరోసారి మమ్మల్ని నిరాశ్రయులను చేసిందని వాపోయారు. గతంలో అగ్ని ప్రమాదంలో సర్వం కల్పోయిన అప్పటి ప్రభుత్వం తమకు వరగబెట్టింది ఏమీ లేదని మా రెక్కల కష్టంతోనే సమకూర్చుకున్నామని తెలిపారు. ఏ రాజకీయ సభలు సమావేశం జరిగిన గుడిసెలలోని వాసులు కావాల్సి వస్తుందని కానీ.. గుడిసెలలో నివసించే పేదలకు కనీస ఇంటి స్థలాన్ని కేటాయించి పక్కా గృహాన్ని నిర్మించి వారికి మౌలిక వసరులు కల్పించాలని ఏ ప్రభుత్వానికి ఏ లీడర్ కూడా పట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పక్కా గృహాలు నిర్మించి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసినట్లయితే ఇలాంటి షార్ట్ సర్క్యూట్ విద్యుత్ అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని బాధితులు వాపోతున్నారు. సాయినగర్ గుడిసెల కాలనీలో గత 13 సంవత్సరాల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో కూడా కోల్పోయిన సమయంలో కూడా మాకు ఎలాంటి నష్టపరిహారం అందలేదని కేవలం తమ రెక్కల కష్టంతోనే సంపాదించి తిరిగి అన్ని సమకూర్చుకున్నామని అన్నారు.

- మంగళవారం జరిగిన అగ్నిప్రమాదం ఇంట్లో ఉన్న వస్తువులను సరుకులను లక్షల్లో నగదు, బంగారు ఆభరణాలను, సర్టిఫికెట్లను కూడా కోల్పోయామని సాయినగర్ గుడిసెల కాలనీ నివాసితురాలు లోహిత విలపించారు.
- మంగళవారం ఉదయం తామిద్దరం పనికి వెళ్లిపోయామని అగ్ని ప్రమాదం జరిగిందని సమాచారం తెలిసిన వెంటనే వచ్చేసరికి మా ఇల్లు అగ్ని ప్రమాదంలో బూడిదైందని గోపన్న అనే తాపీ మేస్త్రి దంపతులు బోరుమన్నారు.
- తాను డిగ్రీ పూర్తి చేసి అమ్మానాన్నలతో కలిసి ఈ కాలనీలోనే ఉంటున్నానని అమ్మానాన్నలు ఉదయమే పనికి వెళ్లారని తాను కూడా ఏదో పని చేసుకోవాలని ఉద్యోగం కోసం వెళ్లానని మా కాలనీలో అగ్ని ప్రమాదం సంబంధించిందని సమాచారం తెలియగానే వచ్చి చూసేసరికి తమ ఇల్లు బూడిదైందని మహేష్ అనే యువకుడు బోరుమన్నాడు.
- తాను ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తూ నా భార్య మరో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ఇద్దరి సంపాదనతో కుటుంబాన్ని పోషించుకున్న తమకు ఈ అగ్ని ప్రమాదం తమకు బూడిద మిగిల్చిందని రాకేష్ అతడి భార్య దీపిక కన్నీటి పర్యంతమయ్యారు.

జీతాలు రాగానే కాలి బూడిదయ్యాయి

నెలలో మొదటి వారమే కావడంతో తీసుకున్న జీతభత్యాలను కూడా చిట్టీలకు గాని ఇతర పంపకాలు జరగకుండానే తమ జీతం డబ్బులు కూడా అగ్ని ప్రమాదంలో కాలిపోయాయని బోరుమంటున్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని సాయినగర్ గుడిసెల కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంతో సుమారు 30 కుటుంబాలు సర్వం పోవడం పట్ల తీవ్ర బాధాకరమని నాగోల్ డివిజన్ ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం అగ్ని ప్రమాద బాధితులను గుర్తించి వారికి తక్షణ సహాయం అందించి తిరిగి పునరావసం కల్పించి ఆదుకోవాలని కోరారు. ఎల్‌బీనగర్‌లో నిత్యం అగ్ని ప్రమాదాలు జరుగున్నా ఫైర్ స్టేషన్ అందుబాటులో లేకపోవడంతో అగ్ని ప్రమాదాల తీవ్రత పెరిగిపోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన వస్తువులు, గుడిసెలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



విలపిస్తున్న బాధితులు



బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

బాధితులను ఆదుకోవాలి..

సాయినగర్ గుడిసెలు కాలిపోయిన విషయం తెలుసుకున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంగళవారం సాయినగర్ గుడిసెల్లో కాలిపోయిన గుడిసెలనను పరిశీలించి బాధితులను మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలిపోయిన ప్రతి గుడిసెకు ప్రభుత్వం తరుపున రూ. 10 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘటనా స్థలాన్ని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌తో కలిసి పరిశీలించి బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన పేదలకు ప్రభుత్వం అందుకోవాలని సూచించారు. సొంత ఖర్చులతో వెంటనే బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేస్తాని హామీ ఇచ్చారు.
- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. వ్యక్తిగతంగా బాధితులకు రూ. 3000 చొప్పున ఆర్థిక సాయం, బియ్యం పంపిణీ చేస్తాని తెలిపారు. కలెక్టర్, ఆర్‌డీఓతో మాట్లాడి తక్షణ సహాయం అందించాలని సూచించారు. అగ్ని ప్రమాదం బాధితులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పాటు పక్కా ఇల్లు కట్టించేలా చూస్తామని హామీ ఇచ్చారు.



బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న మధుయాష్కీ గౌడ్

దేశవ్యాప్త కులగణన చరిత్రాత్మకం



హస్తినాపురంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

హస్తినాపురం: దేశవ్యాప్తంగా కులగణన చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మక నిర్ణయమని చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ మాజీ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో హస్తినాపురం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ చిత్రపటానికి మధుసూధన్ రెడ్డి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశమంతా ఆశ్చర్య పోయే విధంగా గతంలో ఎన్నడూ లేని విధంగా జనగణనతోపాటు కులగణన చేయడానికి కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్, నాయిని శ్రీకాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, రాఘవేందర్‌యాదవ్, గోవర్ధన్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, రాము, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.



మర్రిచెట్టు@102 ఏళ్లు

మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ కార్యాలయంలో 102 సంవత్సరాల నాటి ఊడల మర్రి చెట్టు ఎకరం స్థలంలో విస్తరించి చూపరులను ఆకట్టుకుంటుంది. ప్రతిరోజు కార్యాలయానికి వచ్చే వారు చెట్టు కింద కూర్చొని సేద తీరుతుంటారు. నగరంద నడిబొడ్డున ఉన్న ఈ ఊడల మర్రి చెట్టును అభివృద్ధి చేసి చుట్టూ పచ్చదనం చేయాలని పలువురు కాలనీవాసులు కోరుతున్నారు. –చాదర్‌ఘాట్

సీబీఐ కోర్టు తీర్పుపై సంబురాలు

హర్షం వ్యక్తంచేసిన బీఆర్‌ఎస్ శ్రేణులు

బడంగ్‌పేట్: ఓబుళాపురం మైనింగ్ అక్రమ తవ్వకాల కేసులో ఎమ్మెల్యే సబితారెడ్డిని నిర్దోషిగా పేర్కొంటూ మంగళవారం సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. దీంతో బీఆర్‌ఎస్ బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో దీంతో సంబురాలు చేసుకున్నారు. బాణసంచాలు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రామిడి రాంరెడ్డి మాట్లాడుతూ.. మొదటి నుంచి కూడా తాను ఏ తప్పు చేయలేదని, తనపై కావాలపే అభియోగం మోపారని ఎమ్మెల్యే చెబుతున్నా వినకుండా కేసును సీబీఐకి అప్పగించారని విమర్శించారు. ఎట్టకేలకు ఆమెను నిర్దోషిగా పేర్కొంటూ ఆమెకు కోర్టు ఊరట కలిగించిందని తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా భావించి 25 ఏళ్లుగా 24 గంటలు ప్రజలకోసం పనిచేస్తున్న సబితారెడ్డిని ఏ తప్పు చేయలేదని కోర్టు ప్రకటించడం చాలా సంతోషం అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పి.ఆనంద్‌రెడ్డి, సూర్లగంటి అర్జున్, ఏనుగు రాంరెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రాజు, బాలేశ్‌చారి, చిత్రం సాయి, కర్రె బల్వంత్, సంతోష్, గట్టు మహిపాల్, బంగారు బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టు తీర్పుపై హర్షం

మీర్‌పేట: ఓబులాపురం గనుల కేసులో ఎమ్మెల్యే సబితారెడ్డిని నిర్దోషిగా పేర్కొంటూ సీబీఐ కోర్టు తీర్పు చెప్పడంతో మీర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. సబితారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని, 12 ఏళ్ల తర్వాత సానుకూలమైన తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. నాయకులు భూపేశ్‌గౌడ్, జటావత్ శ్రీను నాయక్, సిద్దాల బీరప్ప, అనిల్‌యాదవ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్, సునీతబాల్‌రాజు, విజయలక్ష్మి, సిద్దాల అంజయ్య, రమేశ్, అవినాశ్ ఉన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..టమోటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.21, దొండ రూ.25, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.17, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.07, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.35, మునగ రూ.35, కందగడ్డ రూ.85, బీట్‌రూట్ రూ.21, కీర రూ.35, బీన్స్ రూ.85, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



నాగోలు: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జైపురికాలనీలోని నువ్వలబండలో నివాసముండే లావణ్య అలియాస్ సరిత(30) ఈ నెల 5న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఎంతకీ తిరగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



- బండ్లగూడ ఫతుల్లాగూడకు చెందిన కొమ్ము భాస్కర్, పద్మ భార్యాభర్తలు. గత నెల 13న భాస్కర్ భార్యతో గొడవ పడి ఇంట్లో నుంచి తన బైక్ తీసుకొని వెళ్లిపోయాడు. అనేక ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అభివృద్ధి పనులకు నిధులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా గణేష్‌నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణం జీహెచ్‌ఎంసీ ప్రత్యేక నిధుల నుంచి రూ.21 లక్షలు మంజూరు అయ్యాయని టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ తెలిపారు. గణేష్‌నగర్‌లో నెలకొన్న సమస్యలను జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జలమండలి ఎండీకి వినతి



ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంగళవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ..హస్తినపురం డివిజన్ పరిధిలోని రోషన్‌దౌలలో పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీటికి అందిచాలని కోరారు. హస్తినాపురం, చంపాపేట, మన్సూరాబాద్ డివిజన్లలోని పలు కాలనీల్లో నూతన డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా శివారు కాలనీల్లో యుద్ధప్రాతిపాదికన పనులను చేపట్టాలని సూచించారు. దీనికి స్పందించిన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లోజు రవి, దొడ్ల ప్రకాష్, కొలన్ నరేందర్‌రెడ్డి, చంద్రయ్య, మహేందర్, డేవిడ్, పాండు నాయక్, తిరుపతయ్య, అబ్రహం, ఈశ్వరయ్య, రాధకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యలకు చెక్

మన్సూరాబాద్: ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచి లో ఓల్టేజీ సమస్యలకు చెక్ పెడుతున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని ఆయా కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు విద్యుత్ అధికారులతో మాట్లాడి ఎక్కువ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం పలు కాలనీలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వినాయక్‌నగర్ కాలనీలోని హనుమాన్ మార్గ్‌లో 100కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు వదులుగా ఉండి వేలాడుతున్నాయని అధికారులు వాటిని సరిచేయాలని కోరారు. అవసరమైన చోట నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగలకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని విద్యుత్ అధికారులకు సూచించారు.



నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తున్న నర్సింహారెడ్డి

వివిధ రాష్ట్రాలకు చెందిన 45 మద్యం బాటిళ్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

దిల్‌సుఖ్‌నగర్: ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్న ఘటన సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ మన్సూరాబాద్‌లో నివాసముండే అక్షయ్ కుమార్(30) తన ఇంట్లో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు రంగారెడ్డి ఏఈఎస్ జీవన్ కిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలరాజు, ఎస్సై రవి సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించి 45 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్ల విలువ రూ. 1.20 లక్షల మేరకు ఉంటుందని ఏఈఎస్ జీవన్ కిరణ్ తెలిపారు. ఏడాదిగా ఫొటోగ్రఫీ పేరుతో పలు ప్రాంతాలకు వెళ్లి వస్తూ మద్యం బాటిళ్లను తీసుకువచ్చి హైదరాబాద్‌లో అమ్మకాలు సాగిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

మహేశ్వరం: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు దళారులని నమ్మి తక్కువ ధరకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాని పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, రైతులతో కలిసి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం వరి ధాన్యానికి కనీస మద్దతు ధరను అందిస్తుందని, ప్రతీ రైతు ప్రభుత్వం ఆధ్వర్యంలో పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి లాభాలు పొందాలన్నారు. రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఏ రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320లు, సాధారణ రకానికి రూ.2,300లతో పాటు ఏ గ్రేడ్ సన్నాలకు రూ.500లు అదనంగా బోనస్ ఇస్తుందన్నారు. అంతకుముందు రైతుల వరి ధాన్యాన్ని సహకార సంఘం అధికారులు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు పి.బాలయ్య, కె.ప్రభాకర్, జంగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనందం, పీఏసీఎస్ సీఈఓ షఫీ, మార్కెటింగ్ శాఖ అధికారి శ్రీకాంత్, అసిస్టెంట్ సీఈఓ అయిలయ్య, రైతులు చంద్రయ్య, నవీన్, అదిల్ పాల్గొన్నారు.